ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం అధికారులు, కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. హౌసింగ్ ఏఈ కమలార్, గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విరాళాల సేకరణ



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో జరుగనున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల కరపత్రాలు అందజేసి విరాళాలు సేకరించారు. సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు జయచంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, మండల కార్యదర్శి శివ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

జవహర్‌నగర్: కార్పొరేషన్‌లోని డబుల్ బెడ్రూమ్ అపార్ట్‌మెంట్‌లోని షటర్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ వసంత ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 6వ తేదీ వరకు వేలం నిర్వహిస్తామని, 6 షటర్లకు వేలం పాట వేస్తున్నామని, రూ.100 జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని కార్యాలయంలో చెల్లించి ఫారం పొంది, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకులో రూ.2 వేలు జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం పేరుతో డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

శామీర్‌పేట్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు హకీంపేట్‌లోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అండర్ 8,10,12,14,16,18,20, మెన్ అండ్ ఉమెన్ అర్థమెటిక్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలను ఎంచుకుని తగిన శిక్షణలో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి దశలోనే విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. జిల్లా జయింట్ సెక్రటరీ రాజు, వైస్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌గా ఆంజనేయులు



కీసర: కీసర పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఆంజనేయులు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ గతంలో పనిచేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

వాహనాల తనిఖీ

ఉప్పల్: వరుస పండుగుల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా నిరంతరం స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు ఉప్పల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి అన్నారు. ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో విధిగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

మల్కాజిగిరి: అనంతసరస్వతీనగర్‌లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. రోడ్లు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో నూతన సీసీరోడ్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులు, తాగునీటి సరఫరాలో సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ప్రభాకర్‌గౌడ్, యాదగిరి, సత్తయ్యగౌడ్, ఇంద్రసేనారెడ్డి, మల్లేష్, మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ ఏదీ..?

బస్తీ దవాఖానాల్లో మందుల కొరత
- కొన్నింటికే పరిమితమైన యాంటీబయాటిక్స్
- ఉన్న వాటితో సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది



సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇదే సమయంలో పలు ఆరోగ్య కేంద్రాల్లో మందులు (మెడిసిన్స్) తక్కువగా ఉన్నాయి. సాధారణ వేళల్లోనే సిబ్బంది తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జ్వరాలు, ఇతర వ్యాధుల భారినపడిన వారు దవాఖానాలకు బారులు తీరుతున్నారు.

◆ జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని దవాఖానాలు జ్వర బాధితులతో రోజురోజుకు కిక్కిరిస్తున్నాయి. విభిన్న వాతావరణ మార్పులు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు కూడా అధికంగా నమోదవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే అనే తేడా లేకుండా మంచానపడుతున్నారు.

◆ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్‌కేసర్, శామీర్‌పేట్) సేవలు అందిస్తున్నాయి. 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్లు, 26 యూపీహెచ్‌సీల్లో 6 డెలివరీ పాయింట్లు ఉన్నాయి. 103 పల్లె, 71 బస్తీ దవాఖానాల్లో ప్రజలు వైద్యసేవలను పొందుతున్నారు.

◆ జిల్లాలో 24 గంటలు పనిచేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతిరోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా.. ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో 200 దాటుతోంది. ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ఇంకా అధికంగా ఉంటోంది. వీటి పరిధిలో జ్వర బాధితులు ఎక్కువమంది నమోదవుతున్నారు.

సిబ్బంది కొరత..

కొన్ని చోట్ల సిబ్బంది కొరతతో సరైన మందులు అందుబాటులో లేవు. కనీసం డైక్లోఫినాక్స్ మాత్రలు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. యాంటీబయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, వాంతులు, విరేచనాలు, రక్తపోటుతో పాటు చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన క్రీముల కొరత ఉంది.

మందుల సర్దుబాటు..

జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో జ్వర సర్వేలను వైద్యారోగ్యశాఖ ముమ్మరం చేస్తోంది. పారిశుద్ధ్య చర్యలను మెరుగుపరిచేందుకు పురపాలక సంఘాల వార్డు అధికారులతో వైద్య సిబ్బంది సమన్వయం చేసుకుంటుంది. పీహెచ్‌సీల్లో అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న మందులతో సమస్యలను అధిగమిస్తూనే అవసరమైన మందులు తెప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్‌వో ఉమాగౌరి

కీసర: కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా వైద్యాధికారి ఉమాగౌరితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రతిరోజు జరిగే ఓపీ కేసులు, ప్రసవాల గురించి అడిగి తెలుసుకుని, మెడిసన్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వర్షం పడిన ప్రతిసారి నిమ్ము రావడాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. వైద్యాధికారి మనూజరెడ్డి, ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా (భువనగిరి) కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం (నషా ముక్త్ అభియాన్)పై మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కమ్యూనిటీ ఎడ్యూకేటర్ కేవీ సురేష్, కమ్యూనిటీ ఎడ్యూకేటర్ రమాకాంత్ హాజరై మద్యం, వ్యసనాల వల్ల కలిగే దుష్పలితాలు మానసిక, శారీరక, సామాజిక సమస్యలు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. మాదక ద్రవ్య వినియోగం మానవాళి మనుగడకు పెను ప్రమాదమని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా ‘భోగ్ బండారో’ పూజ



పోచారం: కొర్రెముల్‌లోని లక్ష్మీనగర్‌లో సేవాలాల్ మహరాజ్, మేరమ్మ యాడి భోగ్ బండారో పూజ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ముఖ్య అతిథులుగా బంజారా సాధు మహరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మద్దిమడుగు పీఠాధిపతి జయరాం స్వామి, దుండిగల్‌లోని సేవాలాల్ పీఠాధిపతి శంకర్ బావలాల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలన్నారు. సేవాలాల్ ఆధ్యాత్మిక పీఠాలు మరెన్నో ప్రదేశాల్లో విస్తరించాలని ఆకాంక్షించారు. పీఠాధిపతుల శిష్యులు, సేవాలాల్ సంఘం ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

ముగిసిన ‘ఏఐ అండ్ సైబర్ సెక్యూరిటీ’ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ‘ఏఐ అండ్ సైబర్ సెక్యూరిటీ- డిజిటల్ భారత భద్రతకు నూతన శక్తి’పై 5 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ సర్వర్స్ సీఈఓ సాయిసతీష్ పాల్గొని సైబర్ సవాళ్లు, ఏఐ ఆధారిత సైబర్ భద్రత పరిష్కారాల అవసరం, యూజర్ ప్రవర్తన విశ్లేషణ, ఆటోమేటెడ్ రెస్పాన్స్, ఏఐ ఉపయోగపూరిత అభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. వర్క్‌షాప్‌తో విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానంతో పాటు భద్రతపై అవగాహన పెరుగుతుందని కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి అన్నారు. డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, వరప్రసాద్, భద్రు, రూపరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు



మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం బాలసరస్వతీనగర్‌లో సుమారు రూ.49 వేలతో ఇంకుడు గుంత ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో వర్షపు నీరు వృధా కాకుండా ముఖ్యమైన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.11 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నీటిఎద్దడి ఎదుర్కొంటున్నామని, భవిష్యత్తరాలను దృష్టిలో ఉంచుకుని అవకాశం ఉన్న ప్రతి ఇంటి యజమాని ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, ఏఎమ్‌హెచ్‌ఓ మంజుల, ఎస్ఎఫ్ఏ గిరి పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి రక్షణ కిట్ల పంపిణీ



కుషాయిగూడ: శానిటేషన్ సిబ్బందికి జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం చిన్న చర్లపల్లి, కుషాయిగూడ వార్డు కార్యాలయాల్లో ఆమె సిబ్బందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధిగా రక్షణ పరికరాలను ధరించి కార్మికులు విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణతో పాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

◆ సీఎం రేవంత్‌రెడ్డి చొరవచూపి ఉప్పల్ నియోజకవర్గం, చర్లపల్లి డివిజన్‌కు నిధులు కేటాయించడంపై కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి డివిజన్‌కు అదనంగా రూ.1.80 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాండు, అశోక్, విశ్వనాథం, వినోద్, క్రాంతి పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం



రథోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గోదాసమేత మన్నారు రంగనాయకస్వామివారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం నుంచి చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గురుకులంలో తక్షణ ప్రవేశాలు

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మల్కాజ్‌గిరి లలిత కళల కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ఒకేషనల్, టూరిజం, హాస్పిటాలిటీ, ఆఫీస్ అసిస్టెంట్ తరగతులకు తక్షణ ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు ప్రకటించారు. పదోతరగతిలో 420 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు ఈనెల 31న ఉదయం 9 గంటలకు తక్షణ ప్రవేశాలకు అర్హులు. విద్యార్థులు అసలు ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, 3 సెట్ల జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. ఆఫీస్ అసిస్టెంట్ ఎస్సీ-12, ఎస్టీ-2, ఓసీ-1, బీసీ-5, మైనారిటీ-1, బీసీ సీ-1, టూరిజం, హాస్పిటాలిటీలో ఎస్సీ-21, బీసీ-5, ఓసీ-1, ఎస్సీ-2, మైనారిటీ-1, బీసీ సీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. 31న సాయంత్రం 4 గంటలకు అర్హుల జాబితా ప్రదర్శిస్తామని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు 31లోగా హాజరుకావాలి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఈనెల 31న కళాశాలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ లలిత కోరారు. గురుకుల పాఠశాలలో 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, పదోతరగతి పాసై గురుకుల స్కూల్‌లో సీటు కోసం ఎదురుచూస్తున్న వారు ఈ ఏడాదిలో తీసుకున్న ఆదాయ ధ్రువీకరణపత్రం, ఫిట్‌నెస్, స్టడీ సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 9గంటలకు హాజరుకావాలని కోరారు. ఖాళీలను బట్టి సీట్లు భర్తీ చేస్తామని వివరించారు.

ఐదు నెలలుగా పెండింగ్‌లోనే..!

- మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించని జీతాలు, బిల్లులు
- గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో కట్టెలపై వండుతున్న వైనం



ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో భోజనం వండుతున్న సిబ్బంది

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి సిద్ధం చేసి వడ్డించే మహిళా సమాఖ్యలకు చెందిన కార్మికులకు గత 5 నెలలుగా జీతాలతో పాటు మెస్ బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో సబ్సిడీతో కూడిన వంటగ్యాస్ సిలిండర్లను స్థానికంగా ఉన్న డీలర్ల వద్ద నుంచి తామే కొనుగోలు చేసి పొగ లేకుండా వంటలు చేసే వారిమన్నారు. ప్రస్తుతం వంటగ్యాస్ సరఫరాను నిలిపేయడంతో కట్టెల పొయ్యిపై వంటలు చేయడంతో వచ్చే పొగతో తమతో పాటు విద్యార్థులు కూడా అనారోగ్యం పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుందని మిగతా కూరగాయాలు, గుడ్లు, నూనె, కట్టెలు, పప్పులు, ఉప్పులు అన్ని తామే వడ్డీకి అప్పులు తెచ్చి వండుతున్నామని వాపోయారు. వెంటనే ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు పట్టించుకుని పెండింగ్‌లో ఉన్న మెస్‌బిల్లులు, జీతాలు చెల్లించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి



బ్యాడ్జీలను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ తమ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ సూచించారు. మంగళవారం నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం హెడ్‌బాయ్, హెడ్ గరల్స్‌కు బ్యాడ్జీలను అందజేసి విద్యార్థులను ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ శివకుమార్, ప్రధానోపాధ్యాయురాలు నిషాత్‌అంజూమ్, ఎస్సై మైబెలి తదితరులున్నారు.

రూ.59 లక్షలతో అభివృద్ధి పనులు



కాప్రా: ఎస్‌ఆర్‌ఐ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. రూ.59 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్ణరాజ్ మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌ఐ కాలనీ ఏర్పడి దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తుందని, కాలనీ వెంచర్ చేసే సమయంలో వేసిన రోడ్ల మరమ్మతులకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కాప్రా డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.

తాళాలు పగులగొట్టి చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. డీఐ తిమ్మప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలోని అంజనపురికాలనీలో నివసించే సుశాంత్ మూడ్రోజుల క్రితం భార్యను ఊరి నుంచి తీసుకురావడానికి మదనపల్లికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో దాచిన 26 తులాల బంగారు ఆభరణాలు, రెండున్నర తులాల వెండి నగలు, రూ.20 వేల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పోలీసులకు వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగుల పంచమి వేడుకలు



వినాయక్‌నగర్ ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో నాగులపంచమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, అవుషాపూర్, అంకుషాపూర్, ఏదులాబాద్, మర్పపల్లిగూడ, మాదారం, ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కనిగూడ గ్రామాల్లో మహిళలు పుట్టల్లో పాలుపోసి వైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని లింగాల కుంట, శివారెడ్డిగూడలోని వల్లీసమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మేడ్చల్: మహిళలు భక్తిశ్రద్ధలతో నాగదేవతను కొలిచే నాగులపంచమి పండుగను మహిళలు మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లోని ఆలయాల వద్ద ఉన్న పాముపుట్టల వద్ద పాలుపోసి, పసుపుకుంకమలతో పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

◆ అత్వెల్లి పోచమ్మ ఆలయం, మేడ్చల్ వినాయక్‌నగర్ ఎల్లమ్మ ఆలయం, మేడ్చల్ పెద్ద చెరువు కట్ట మైసమ్మ, నూతన్‌కల్ ఎల్లమ్మ ఆలయం సహా తదితర ఆలయాల వద్ద మహిళల సంఖ్య అధికంగా కనిపించింది.

కీసర: కీసరగుట్టలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నాగుల పంచమి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

చీర్యాలలో..

చీర్యాలలోని లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో నాగదేవత పుట్టకు ఆలయ ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వల్లీదేవసేన సమేత కొక్కి నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృత నవకాలశాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించారు.



చీర్యాలలో నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి



ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి